(టేబ్యులేషను) చేసి వున్నాయి. అందులో కాళీకృష్ణ - 29 - 5అ. 5అం. జూనియర్ ఆఫీసర్, ఎకౌంట్సు - 3200, వగైరా అన్నీ ఉన్నాయి.

"అబ్బాయి అనుకుని మీ శారదకి సరిపోతాడు అని చూసుకోడానికొచ్చేవన్నమాట!" అన్నాను, కాగితం ఇచ్చేస్తూ.

"అంటే - ఈ ఒక్కపనిమీదే కాదనుకో. కాని, వివరాలు చూస్తే కాళీకృష్ణ అబ్బాయి అనుకోడంలో నా పొరపాటేమైనా ఉందంటావా?" అని కాగితం మళ్లీ నాకు ఇచ్చేడు.

పురుషుడా, స్త్రీయా అని ఉన్న కోలమ్‌లో 'పు' అనిగాని 'స్త్రీ' అనిగాని అచ్చుపడలేదు.

నాలుగు లైన్లకి పైన 'పు' అని ఉంది. అక్కణ్ణించి డిటోకి ఉపయోగించే చిహ్నం వుంది.

కాళీకృష్ణ మళ్లీ వచ్చింది. నాలుగు ఉత్తరాలు చూపించింది. "ఇవికాక మూడు టెలిఫోను కాల్సు వచ్చేయి సార్" అంది, కాసేపు నవ్వుకుని "మరుసటి సంచికలో సవరణ వేయించాలి" అని నిర్ణయించుకున్నాను.

"అదికాదూ, నాతో ముందే ఎందుకు చెప్పలేదు?" అన్నాను ముకుందరావుతో.

"ఏం చేయను! నీకూ పెళ్లికావల్సిన కూతురు ఉంది కదా. నువ్వెక్కడ తన్నుకుపోతావో అని గాభరాలో పడ్డట్టున్నాను..." అన్నాడు ముకుందరావు. ★

# 58. స్పెషల్ ప్రయాణం

**బా**గా ముందుగానే నిర్ణయం అయినప్పటికీ మొన్న ఐదో తారీఖునాడు నేను హైదరాబాద్ నుండి విశాఖపట్నం రావడానికి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఖాళీ దొరక్క; "సమ్మర్ స్పెషల్" అనే ప్రత్యేక రైల్లో మాత్రం రిజర్వేషన్ దొరికింది. స్పెషల్ ట్రెయిన్లూ స్పెషల్ విమానాలూ ఎవరో గొప్పవాళ్లకి మాత్రం వేస్తారు కదా; ఈ ప్రయాణంలో సామాన్యులందరికీ వి.ఐ.పి. ట్రీట్‌మెంటు దొరుకుతుంది కదా అనిపించి సరదాపడ్డాను.

ఈ స్పెషల్ ట్రెయిన్లు వేసవి రద్దీని తట్టుకోడానికి వేసేరుట. సికింద్రాబాదులో ప్రతి మంగళవారం శుక్రవారమూ బయలుదేరుతాయట. రోజూ ఉంటే అది స్పెషల్ ట్రెయిను ఎందుకవుతుంది?

దీని రూటూ రేటూ కూడా స్పెషలే. గోదావరి ఎక్స్‌ప్రెస్సు, ఈస్టుకోస్టు, కోణార్క్‌లాంటి ఆర్డినరీ బళ్లు కాజీపేట, విజయవాడ, ఏలూరు, సామర్లకోట రూట్లో వస్తాయి కానీ ఈ స్పెషల్ ట్రెయిన్ నడికుడి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, భీమవరం, నిడదవోలు, సామర్లకోట ద్వారా ఒక స్పెషల్ రూట్‌లో వస్తుందిట. కొంచెం చుట్టుదారే అయినా మన రాష్ట్రంలో మనం ఎప్పుడో కాని చూడని స్టేషన్లు చూడగలగడం ఒక స్పెషాలిటీ. మామూలు రూటు 709 కిలో మీటర్లయితే ఇది 775 కిలోమీటర్లుట. ఇందులో మళ్లాను, సికింద్రాబాదు నుంచి నడికుడి ద్వారా గుంటూరికి ఉన్న దూరానికి మరో సగం కిలోమీటర్లు కలిపి అలా పెరిగిన దూరానికి ఛార్జీ వసూలు చేసేరుట. అంటే, మామూలు రూటుకన్నా తక్కువే ఉన్నా ఎక్కువ ఉన్నట్టు రాసుకుని రేటుకూడా తదనుగుణంగా పెంచేరుట. అంతటితో సరిపెట్టక; ఎక్కువ డబ్బు

పుచ్చుకున్నందుకు ఎక్కువసేపు రైల్లో ఉండనిస్తారుట. గోదావరి ఎక్స్‌ప్రెస్ 13న్నర గంటల్లోనూ, ఈస్టుకోస్టు 14 గంటల్లోనూ, కోణార్క 12న్నర గంటల్లోనూ ముగించే ప్రయాణానికి ఈ స్పెషల్ రైల్లో 15 గంటలు కూర్చోనిస్తారుట.

వెనకోసారి బ్రహ్మాజీరావుగారు నన్ను ఒక స్పెషల్ ట్రైన్‌లో విశాఖపట్నం నించి రాయఘడాకి తీసుకెళ్లేరు. అప్పట్లో ఆయన రైల్వేలో పెద్ద అధికారి. ఒక పూర్తి బోగీ. దాంట్లో కేవలం నలుగురికి ఫస్టుక్లాసు బెర్తులు. రైలు నడుస్తూ ఉండగా ఆఫీసు పనులు చూసుకోవాలని అనిపిస్తే అందుకు వీలుగా టేబిలూ కుర్చీలూ మంచి లైటింగు ఏర్పాట్లు. ఫాన్లు, టాయిలెట్‌లో స్నానానికి కూడా ఏర్పాట్లు. అందులోనూ వేణ్ణీళ్లూ చన్నీళ్లూ ఏర్పాటు . విశాఖపట్నం నించి రాయఘడా వెళ్లే లోపల ఒక్క పార్వతీపురంలోనే రెండు నిమిషాలు ఆగింది; మరెక్కడా ఆగలేదు. (అదీ ఆయనకి పార్వతీపురం స్టేషన్‌లో ఆఫీసు పని ఏదో ఉంది కనక!) "స్పెషల్ అంటే ఇలా ఉండాలి!" అనిపించింది. బ్రహ్మాజీరావు గారు నాకన్నా ఎన్నో విధాల గొప్పవారు. ఐనా ఆయన్ని చూసి నేనెప్పుడూ అసూయపడలేదు. కాని, ఇలాంటి స్పెషల్లో ప్రయాణం చేసే హక్కుగలవారు కదా అని ఈ ఒక్కపాయింటు మీదా అసూయపడ్డాను. ఆయన చెప్పేరు. ఇది స్పెషల్ ట్రెయిను కాదు. దీన్ని 'సెలూన్' అంటారని. కాని ఆ వైభోగాన్ని "సెలూన్" అనడం నాకేమీ నచ్చలేదు. సెలూన్ అంటే నాకు తెలిసిన అర్థం వేరు!

మొన్న అయిదో తేదీని నేను సికింద్రాబాదులో ఎక్కిన స్పెషల్ ట్రైన్‌లో ఉన్న స్పెషల్సు కొన్ని నా దృష్టిని ఆకర్షించేయి. మూడు ఫాన్లు ఉండవలసిన త్రి-టయిర్ బిన్‌లో రెండే ఫాన్లు ఉన్నాయి. రెండు లైట్లు పెట్టడానికి పాయింట్లూ స్విచ్చులూ ఉన్నా ఒక దాంట్లోనే బల్బు ఉంది.

కొంతమంది నిద్రపోయే ముందు ఆన్ చేసుకునే బ్లూలైటు లేదు. టాయిలెట్‌లో కుళాయికి బుర్ర లేకపోవడం వల్ల బండి బయల్దేరకముందే టాంకులో నీళ్లన్నీ కారిపోయి టాయిలెట్ పొడిగా ఉంది. పక్క బోగీలోకి వెళ్లి చేతులో మరోటో కడుక్కొద్దామంటే బోగీకీ బోగీకీ మధ్య ఉండే వెస్టిబ్యూల్ (మార్గం) మూసి ఉంది.

ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఆ స్పెషల్ ట్రేన్ సికింద్రాబాద్‌లో బయల్దేరేటప్పుడు కేవలం పదిహేను నిమిషాలు మాత్రం ఆలస్యంగా బయలు దేరడం ఒక ప్రత్యేకత అయితే, రాజమండ్రి వచ్చేసరికి ఆ లేటు మూడు గంటలు (సారీ ఎగేన్; నూట ఎనభై నిమిషాలు) కావడం మరో ప్రత్యేకత.

రైలు రాజమండ్రిలో ఆగినపుడు చిన్న తమాషా జరిగింది. అమెరికాలో స్థిరపడి పోయిన నా మిత్రుడు రంగాచారి ప్లాట్‌ఫారం మీద నడుస్తూ నన్ను గుర్తుపట్టి, తను ప్రయాణం చేస్తున్న బోగీలో తన ఎదుటి సీటు కాళీగా ఉంది కనక నేను అక్కడికి మారిపోతే కబుర్లు చెప్పుకోవచ్చునన్నాడు. సరేకదా అని వెళ్లేసరికి అక్కడ ఇతని పక్కసీట్లో కమలనాభం కూర్చొని ఉన్నాడు. ఇతను రైల్వేలో ప్లానింగు, రీసెర్చి శాఖలో పెద్ద అధికారిగా పనిచేసి మొన్నీమధ్యే రిటైరయ్యాడు. నేను పలకరిస్తూ ఉండగానే వాళ్లిద్దరూ "మీ గురించి నేను విన్నాను" అని (ఇద్దరూ) అంటూ ఒకర్నొకరు తెలుసుకున్నారు. గుర్తుపట్టుకున్నారు.

మేం ముగ్గురం పరిచయస్తులమే అయినా, చాలాకాలం తరువాత కలుసుకున్న వాళ్లమే

అయినా మాకు మాట్లాడుకోడానికి ఇంకేమీ దొరకనట్టు ఈ రైలు ప్రయాణం గురించే మాట్లాడుకోవడానికి సిద్ధపడిపోయామంటే అది ఆ స్పెషల్ ప్రయాణం ప్రత్యేకత కాకపోతే మరేమిటి!

"ఈ లెక్కని మనం విశాఖపట్నంలో మన ఇళ్లకి వెళ్లేసరికి మధ్యాహ్నం రెండు గంటలు దాటిపోతుందేమో!" అని నేనే ముందు ప్రారంభించేను; కమలనాభాన్ని ఉద్దేశించి.

"కావచ్చు," అని కమలనాభం ఊరుకున్నాడు.

"అది సరేగాని, రంగాచారీ!" అని ఇటు తిరిగాను. "నువ్వు అమెరికాలో అంతో ఇంతో సంపాదించుకుంటున్నావు కదా; అక్కణ్ణించి బొంబాయికి, బొంబాయినించి హైదరాబాద్‌కు విమానాల్లో వచ్చిన వాడివి ఈ కాస్త ప్రయాణానికీ రైలెందుకెక్కేవు?

రంగాచారి నవ్వేడు. "స్పెషల్ ట్రెన్ కదా అని ఎక్కేనూ!"

"ఆ దేశాల్లో కూడా ఇలాంటి స్పెషల్ ట్రేన్లుంటాయా!"

"ఉంటాయిగాని ఇలాంటివి ఉండవు. చాలా దేశాల్లో విమాన సర్వీసులు, రైలు సర్వీసులు, బస్సు సర్వీసులు, పెట్రోలు, డీజిలు, కరెంటు, ఆహార సరఫరా, బాంకింగు, రేడియో, టి.వి. ఆఖరికి నీళ్ల ఇలాంటి అత్యవసర సేవలు, ప్రయివేటు యాజమాన్యంలో నడుస్తాయి. ఒకరికంటె ఒకరు బాగా నిర్వహించి ప్రజాభిమానం పొందాలని అందరూ అన్నీ బాగా నిర్వహిస్తారు. అంచేత రైళ్లు లేటయినా, కరెంటు ఆగిపోయినా, నీళ్లుగానీ గాస్‌గానీ సకాలంలో రాకపోయినా ఫోన్ పనిచెయ్యకపోయినా, అక్కడ ఘోరమైన తప్పులుగా పరిగణిస్తారు. ఇక్కడ ఇవన్నీ ప్రయివేటు వాళ్లకి వప్పగిస్తే వాళ్లెక్కడ లాభాలు చేసుకుపోతారో అని కాబోలు; ప్రభుత్వమే ఈ సర్వీసుల్ని చేపట్టింది. సరిగా నిర్వహించడం చేతకాక ఒకటీ; ఎక్కడ వీలుంటే అక్కడ అబద్ధాలాడి సరుకూ డబ్బూ పీల్చేసి ఒకటీ, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న వ్యక్తులు ఈ సర్వీసుల్ని నాసిరకంగా తయారు చేసేరనుకుంటాను."

"ఎందుకయ్యా అలా నోరు పారేసుకుంటారు? అమెరికా భూలోకస్వర్గమే అని మేమూ ఒప్పుకుంటాం. కానీ ఒక్కరోజు రైలేదో రెండుగంటలు లేటయిందని ఏకంగా దేశదూషణకే పాల్పడ్డం మంచిది కాదుకదా!"

"ఒక్కరోజు కాదయ్యా బాబూ; ప్రతీ రోజూ; దాదాపు అన్ని ట్రెయిన్లూనూ; లేటే కద! రైళ్లు రయిట్‌టైమ్‌కి వస్తే వార్తలకి ముందుగానే వేరే వార్తల్లో రేడియో వాళ్లు చెప్తారిక్కడ!" అన్నాను.

"నాకు ఈ దేశం అంటే ప్రేమలేదని మీరు అనుకుంటే అది పెద్ద పొరపాటే అవుతుంది కమలనాభంగారూ," అన్నాడు రంగాచారి. నేను అమెరికా లో ఇప్పటికి ఇరవై ఎనిమిదేళ్ల నుంచి ఉంటున్నాను. ఏడాదికొకసారి కాకపోయినా రెండేళ్లకొకసారైనా ఇండియాకి వస్తున్నాను.

ఒచ్చినప్పుడల్లా నాకు చాతనైనంత డబ్బు ఈ దేశానికి తెస్తున్నాను. ఈ డబ్బంతా ఇక్కడే పెట్టుబడి పెట్టి తెలిసిన వాళ్లకీ తెలియని వాళ్లకీ ఎందరికో ఉపాధి కల్పిస్తున్నాను. నా దగ్గరి బంధువులు సుఖంగా బతకడానికి మంచి సదుపాయాలు చేయడానికే కాక మిగిలినదంతా ఇక్కడి పరిశ్రమల్లోనే ఉంది. మా ఉత్పత్తులన్నీ ఇక్కడి ప్రజలే ఉపయోగిస్తున్నారు. ఈ సంస్థతో

వాటిద్వారా సంపాదించుకుంటున్న వాళ్లూ ఈ దేశ ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం జరుగుతోంది. "ప్రవాస భారతీయుల్లారా రండి; ఇక్కడ పెట్టుబడులు పెట్టండి!" అని మన్‌మోహన్ సింగ్ గారు ఇప్పుడు అడుగుతున్నారు గానీ నేనది ఎప్పుడో అమల్లో పెట్టేను!"

"అదంతా కావచ్చుగానీ రైలు లేటు అయినంత మాత్రం చేత ప్రభుత్వాన్ని తిట్టడమేనా?" అన్నాడు కమలనాభం.

"తిట్టడం కాదు. ఉన్నమాట అనుకుంటున్నాం. స్పెషల్ ట్రేన్ అని పేరు పెట్టుకుని నడుస్తున్న ఈ రైల్లో రైల్వే ఉద్యోగులతో కలిపి సుమారు 1200 మంది ప్రయాణం చేస్తున్నారు. ఈ బండి నాలుగు గంటలు లేటుగా విశాఖపట్నం చేరుకుంటే మొత్తం 4800 గంటల టైమ్ నష్టం. ఇలా జరిగితే ఇంకే దేశంలోనూ ఊరుకోరు. ప్రభుత్వం ఆదాయానికి కారణభూతులైన ప్రజల్ని ముష్టి వెధవల కిందా పనికిమాలిన వాళ్లకిందా జమకట్టే ప్రభుత్వ ఉద్యోగులూ ప్రజానాయకులూ ఈ దేశంలో తప్ప ప్రపంచంలో ఇంకెక్కడా ఉండరు. రైళ్లు లేటయి పన్లు పాడయిపోయాయని వేలాది మంది నిశ్శబ్దంగా కుమిలిపోతూ ఉంటే ఉద్యోగుల్లో కొందరు ఈ నాలుగ్గంటల ఓవర్‌టైమ్ చెల్లింపుకోసం ఆరాటపడుతూ ఉండడం దీంట్లో ఇంకో విశేషం!" అన్నాడు రంగాచారి.

"ఈ స్పెషల్ ట్రైన్ సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం రావడానికి ఇరవై గంటలో ఇరవై ఐదు గంటలో పడుతుంది సుమా - అని ముందే ప్రకటించుకుంటే ఇంత గొడవుండదేమో?" అన్నాను.

"అలా అన్నావు బావుంది. ఇంతకీ నువ్వు మళ్లీ హైదరాబాదు ఎప్పుడొస్తున్నావు" అని అడిగాడు కమలానాభం.

"అదే! పదకొండో తారీకున స్పెషల్ ట్రైన్ ఉందిట కదా. దానికి దొరికిందట; రిజర్వేషను!" అని నేను చెప్పగా ఆ చుట్టుపట్ల కూర్చున్న వాళ్లందరికీ ఒక్కసారిగా నవ్వొచ్చింది.

"ఝవిటో! స్పెషల్ ట్రేనంటే నవ్వులాటగా ఉంది, ప్రతీవాడికీనీ!" - అనుకున్నాను.

★

# 59. అడుగడుగున గుడివుంది

**ఓ**సారి సాయిబాబా అనే పేరుగల నా మిత్రుడొకడు నా దగ్గిర వందరూపాయలు అప్పు పట్టుకెళ్లి రెండు నెలలయిపోయినా తిరిగి ఇచ్చేడు కాదని; అతనిమీద ఒక పాత జోకు ప్రయోగించేను.

"నిన్ను చూసినప్పుడల్లా నాకు రాఘవేంద్రస్వామి జ్ఞాపకం ఒస్తాడు" అన్నాను.

"మాకిద్దరికీ పోలికలేమీ లేవే!" అని సాయిబాబా ఒక క్షణం ఆలోచించి "మన క్లాసుమేటు రాఘవేంద్ర స్వామి సంగతే కదూ, నువ్వు చెబుతున్నావు? ఓహో, తెలిసింది. నాపేరు డైరెక్టుగా దేముడిపేరే అయినట్టు అతనిది కూడా దేముడి పేరే - అందుకనా?" అన్నాడు.

"అందుక్కాదు. అతను కూడా నాకు వంద రూపాయలు బాకీవున్నాడు." అని నేను